ప్రజాశక్తి
మంగళవారం 11 ఫిబ్రవరి 2025 5
శ్రీ సత్యసాయి

వాహనాలను అడ్డగించిన రైతులు

'అదానీ'పై రైతుల ఆగ్రహం

మట్టితరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని దాడితోట, పెద్దకోట్ల, చిల్ల కొండయ్య పల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న విద్యుత్ కర్మాగారం వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్మాగారం వద్ద నుంచి తరలించే మట్టి ట్రాక్టర్లను సోమవారం అడ్డుకున్నారు. దీంతో వందలాది ట్రాక్టర్లు, వాహనాలు నిలిచిపోయాయి. ఈసందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ కర్మాగారం నిర్మాణంలో భాగంగా కొండపైన నీటి నిల్వ కోసం డ్యామ్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఆ నిర్మాణ పనుల్లో తవ్వకాల సందర్భంగా వచ్చిన మట్టిని ఒకచోట గుట్టలాగా టిప్పర్ల ద్వారా వదులుతున్నారని ఆ మట్టిలోని దుమ్ము ధూళి సరిహద్దు ప్రాంతాల్లో గల అరటి పంటల పైన చీనీ పంటలపైన పేరుకుపోతోందని రైతులు వాపోయారు. దీంతో తమ పంటలను ఏ ఒక్క వ్యాపారి కొనడానికి ముందుకు రావడం లేదన్నారు. దీంతో కర్మాగార నిర్మాణం చేపడుతున్న ప్రతినిధులు రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేయడానికి పది రోజుల గడువు ఇవ్వాలని కోరారు.

కరపత్రాలను చూపుతున్న అధికారులు

పన్నులు ఎగ్గొడుతున్న కంపెనీలు : సిఐటియు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కేంద్రప్రభుత్వం చొరవతో నాలుగు పెద్ద కంపెనీలు మన దేశానికి కట్టే పన్నును ఎగవేసి పబ్బం గడుపుతున్నాయని శ్రీ సత్య సాయి జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం రైతు సంఘం నాయకులతో కలిసి కియా పరిశ్రమ వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కియా పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేయడానికి వెళ్లిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు, ఈసందర్భంగతా సిఐటియు రైతు సంఘం నాయకులకు పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం నాయకులు పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒకవైపు మేకిన్ ఇండియా అని ప్రగల్బాలు పలుకుతూ మనదేశంలోని కియా, శాంసంగ్, హుండాయి ,ఎల్జీ కంపెనీలకు దాసోహం అయి లూటీ ఇన్ ఇండియాగా మార్చిందని విమర్శించారు. పెనుగొండ కియా కంపెనీలో 20వేల మంది కార్మికులు తక్కువ వేతనాలతో పనులు చేస్తున్నారని ఇదే పనులు చేసే కార్మికులకు దక్షిణ కొరియాలో ఇంతకు పదింతలు వేతనాలు చెల్లిస్తున్నారని అన్నారు. మన దేశంలోని కంపెనీలలో ఇంత తక్కువ వేతనాలకు పని చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయని విమర్శించారు. కియా కంపెనీలో పనిచేసే కార్మికులకు సరైన వేతనాలతో పాటు పిఎఫ్ ,ఈఎస్ఐ, సెలవులు, బోనస్, ఎందుకు ఉండవని వారు ప్రశ్నించారు. కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించి దేశానికి పన్నులు ఎగవేయకుండా కార్మికులకు ఆసరా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈ.ఎస్. వెంకటేష్ తో పాటు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, గంగాధర్, సిఐటియు జిల్లా నాయకులు బాబావలి, బ్యాల్ల అంజి ,ముత్యాలు, నాగరాజు, సందీప్ ,నందకుమార్, ఆంజనేయులు, ఆదినారాయణ, అంజనప్ప, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి మడకశిర

వివిధ సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే అర్జీలను పరిశీలించి వాటికి పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. మడకశిర తహశీల్దార్ కార్యాలయం వ్యవసాయ గోడౌన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ తిప్పయ్య స్వామిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలకు నిర్దిష్ట గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలన్నారు.ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వారి ప్రాంతాలకే అధికారులు వెళ్లి అర్జీలను స్వీకరించేలా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మడకశిర నియోజకవర్గంలో గత ఆగస్టు మాసంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా నియోజకవర్గంలో అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారన్నారు. హామీల అమలులో భాగంగా ఎపిఐఐసి ఆధ్వర్యంలో విస్తతంగా నియోజకవర్గంలో పలు పారిశ్రామిక వాడలు రానున్నాయని తెలిపారు. ఆర్.అనంతపురం, ఆగళి మండలాల పరిధిలో మెగా పార్కులు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో ఆనంద్, మడకశిర తహశీల్దార్ కరుణాకర్, డిపిఒ సమత, పరిశ్రమల శాఖ జిఎం నాగరాజు, పట్టు పరిశ్రమ శాఖ జెడి పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, సిపిఒ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ వెంకటరమణారెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పేదల సొంతింటి కల నెరవేర్చాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కదిరి పట్టణంలోనిహిందూపురం రోడ్డు, గట్ల వద్ద టిడ్కో గృహనిర్మాణాలను 2015 సంవత్సరంలో చేపట్టారు. ప్రతి లబ్ధిదారుల నుండి ప్రభుత్వం రూ. 500, రూ. 25వేలు రూ. 50వేలు లబ్దిదారుల వాటాగా డబ్బులు కట్టించుకున్నారన్నారు. వంద మందికి పైగా పేదలు తమకు ఇళ్లువస్తాయనే ఆశతో డబ్బులు చెల్లించారన్నారు. లబ్ధిదారుల వాటా పోను మిగతా మొత్తాన్ని బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేసినట్లు చూపించారని ఇప్పుడు కంతుల రూపంలో చెల్లించాలని పేదలకు నోటీసులు ఇస్తున్నారని చెప్పారు. లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకుండా డబ్బులు వసూలు చేయడం అన్యాయమన్నారు. ఒక పక్క ఇప్పటికీ టిడ్కో గృహనిర్మాణాలు పూర్తి కాలేదన్నారు. లబ్దిదారులు టిడ్కో ఇళ్ల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాచారం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టిడ్కో నిర్మాణాలను పూర్తి చేసి లబ్దిదారులకు ఇవ్వాలని అలాగే జగనన్న కాలనీలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, గత ప్రభుత్వంలో మంజూరు చేసిన ఇళ్ల పట్టాలకు స్థలాలు చూపాలని, టిడ్కో ఇండ్లను లబ్దిదారులకు కేటాయించే వరకు బ్యాంకు రుణ వసూళ్లు ఆపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, బాబ్‌జాన్, ఆంజనేయులు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని సుబ్బరాయనిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న రామాలయానికి పుట్టపర్తికి చెందిన హెల్త్ సూపర్‌వైజర్ లింగ రామ్మోహన్ రూ.50వేల విరాళం అందజేశారు. బాల్యంలో తాను గడిపిన గ్రామానికి సాయం చేయాలన్న ఉద్ధేశంతో దేవలయ అభివృద్ధికి విరాళం అందించినట్లు దాత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ముద్దల మహానంద, మేకల నరసింహులు, కేశవ, బైపిరెడ్డి, ప్రతాపరెడ్డి, లక్ష్మీపతి, శంకరప్ప బాపన్న, సతీష్, జయచంద్ర, హరీష్, గణేష్, పాల్గొన్నారు.

రేపు ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని సప్తగిరి పీజీ కళాశాలలో ఈ నెల 12వ తేదీన ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నారాయణరెడ్డి తెలిపారు. బెంగళూరు కు చెందిన రైన్ ఎక్స్ కంపెనీ ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి రౌండ్ లో రాత పరీక్ష, రెండో రౌండ్ లో మౌఖిక పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంబీఏ, ఎంసీఏ పూర్తి చేసిన, ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చున్నారు. ఎంపికైన అభ్యర్థులకు బెంగళూరు కేంద్రంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని, ఏడాదికి రూ.3.60 లక్షల ప్యాకేజీ తో వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ బయోడేటా కళాశాలలో నేరుగా హాజరుకావాలని ప్రిన్సిపల్ నారాయణరెడ్డి సూచించారు.

కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు

పుట్టపర్తి క్రైం: కల్లుగీత కార్మికులకు లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపును కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం సాయి ఆరామంలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. పది రోజులు క్రితం లాటరీ ద్వారానే ఎంపిక చేయగా ఇంకా మిగిలిపోయిన 9 దుకాణాలకు కేటాయింపులు జరిగాయి. 9 దుకాణాల కోసం మొత్తం 59 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో పుట్టపర్తి మండలం వీడుపల్లి గ్రామానికి చెందిన శ్యామల అనే మహిళ దక్కించుకుంది. హిందూపురానికి సంబంధించి మూడు దుకాణాలు, పెనుకొండ మండలంలో ఒక దుకాణం, ధర్మవరం రెండు దుకాణాలు, తాడిమర్రి కి సంబంధించి ఒక దుకాణం, కదిరికి సంబంధించి రెండు దుకాణాలు, నల్లచెరువు, ఎన్ పి కుంటలో చేరో ఒక దుకాణాలను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కల్లుగీత కార్మికులకు దుకాణాలను రిజర్వ్ చేస్తూ నోటిఫికేషన్ ను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. కల్లుగీత ఉపకులాల వారికి దుకాణాలు కేటాయింపులో భాగంగా పారదర్శకంగా లాటరీ ద్వారా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, తహశీల్దారు నీలకంఠారెడ్డి, జిల్లా అధికారి గోవింద నాయక్, ఏఈఎస్‌లు నరసింహులు, పట్టణ సిఐ సునీత, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-హిందూపురం

చికిత్స పొందుతున్న బాధితుడు

పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బెల్లం నరేష్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్ కు తరలించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. బాధితుడు అందించిన వివరాల మేరకు పట్టణానికి చెందిన బెల్లం నరేష్‌కు సంబందించిన భవనాన్ని పది రోజుల క్రితం కొంతమంది పడగొట్టారు. ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని బెల్లం నరేష్ పోలీసులను ఆశ్రయించాడు. అయితే ఈ విషయంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారు. దీంతో గత ఆదివారం రాత్రి సమయంలో తన భవనాన్ని పడగొట్టడానికి కొంత మంది వచ్చారని పోలీసులకు బాధితుడు తిరిగి ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు స్పందించలేదు. ఈ విషయంలో తనకు పోలీసులు న్యాయం చేయకుండా, చితక బాదారని ఆ దెబ్బలు భరించలేక పోలీసుస్టేషన్‌లోనే కత్తితో పొడుచుకున్నానని బాధితుడు బెల్లం నరేష్ వెల్లడించారు. తీవ్రంగా రక్తస్రావం కావడంతో తనని ఆసుపత్రికి తరలించారని విలేకరుకు తెలిపాడు.

ఒకటో వార్డుకు రహదారి ఏర్పాటు చేయాలి : సిఐటియు

అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో ఒకటవ వార్డు గూడ్స్ షెడ్ కొట్టాల రహదారికి మరమ్మతులు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్‌కి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు జెవి రమణ, ఎస్‌హెచ్ బాషా, చేనేత కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ గూడ్స్ షెడ్ కొట్టాల్లో దాదాపు 20 సంవత్సరాల క్రితం గుత్తా వెంకట నాయుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రహదారికి తారురోడ్డు వేశారని అన్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఆ రహదారి మరమ్మతులు చేపట్టనందున పూర్తిగా గుంతల మయమైందన్నారు. వృద్ధులు, వికలాంగులు, వాహనదారులు వెళ్లడానికి అనేక రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్పందించిన కమిషనర్ వార్డు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి రోడ్ల మరమ్మతులు వెంటనే చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ హైదర్‌వలి, చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

తమ సమస్యను వివరిస్తున్న మాజీ మావోలు

మాజీ మావోయిస్టులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

తమకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను కొందరు ఆక్రమించుకుని అమ్ముకుంటున్నారని, అధికారులు స్పందించి దీనిని నియంత్రించాలని మాజీ మావోయిస్టులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో అందుబాటులో ఉన్న డిఆర్ఒ విజయసారధికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ ముందు మీడియాతో మాట్లాడుతూ జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని ప్రభుత్వం పిలుపు కోసం తాము బయటకు వచ్చామన్నారు. ధరణి వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని మాజీ మావోలు సానుభూతిపరులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని అధికారులను కలిసి విన్నవించుకున్నామన్నారు. మండల పరిధిలోని కప్పల బండ గ్రామ పొలం సర్వేనెంబర్ 315-1 నందు సుమారు 20 మందికి ఐదు ఎకరాలు ప్రభుత్వం కేటాయించి పట్టాలు అందజేసిందన్నారు. గత ఆరేళ్ల క్రితం తాము అంతా కలిసి కొంత డబ్బులు కూడా ఆ భూమి యజమానికి చెల్లించామన్నారు. కొందరు విలువైన స్థలాలపై కన్నేసి తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ బలంతో తమ స్థలాలను కబ్జా చేసి ఇతరులకు అన్ని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. తాము అధికారులందరికీ న్యాయం చేయాలని కోరామన్నారు. కబ్జాదారులు కోర్టుకు వెళ్లారని అయితే పుట్టపర్తి, పెనుకొండ కోర్టుల్లో తమకే కేటాయించాలని తీర్పునిచ్చారన్నారు. తమ రాజకీయ బలంతో కొందరు పెద్దందారు, భూస్వామ్య విధానంతో ఆక్రమించుట ఆ స్థలాలను అమ్ముకోవడం లాంటి చర్యలకు పూనుకున్నారన్నారు. జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మావోలు బాలు, శ్రీనివాసులు, శ్రీరాములు, ఆదినారాయణ, బాలరాజు, కృష్ణా నాయక్, కుల్లాయప్ప పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎంవిఐ వరప్రసాద్ విద్యార్థులకు సూచించారు. రహదారి భద్రతా వారోత్సవా ల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.స్మిత మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విద్యార్థులు తప్పకుండా సూచనలు పాటించాలని తెలిపారు. ఆర్‌టిఒ శ్రీనివాసులు మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎంవిఐ మైనర్లు వాహనం నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎఎంవిఐ రాజేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ యాసిన్, సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని మల్లేపల్లి గ్రామ జడ్పీ హైస్కూల్‌లో రూరల్ సిఐ శ్యామ్‌రావు విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. నిబంధనలను వివరించారు.

కెజిబివి తనిఖీ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయ(కెజిబివి)ని సోమవారం ఎంపిడివో అంజనప్ప సందర్శించి రికార్డులు, తరగతి గదులను, డిజిటల్ క్లాస్ బోధనలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం, నీటి సౌకర్యం, టాయిలెట్లను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. పలు విషయాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ అటెండెన్స్ నమోదు, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, సౌకర్యాలు, విద్యాబోధనలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఒ రిహానా, డాక్టర్ ఆనంద్ వర్ధన్ ఉన్నారు.

అత్యవసర పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

వైద్యులతో మాట్లాడుతున్న జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

అత్యవసర పిల్లలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. సోమవారం హిందూపురం జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న అత్యవసర పిల్లల విభాగాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న లాబోరేటరీ, దంత విభాగం, రిజిస్ట్రేషన్, ఫిజియోథెరపీ, కంటి చికిత్స విభాగం తదితర విభాగాలను పరిశీలించారు. ఆయా విభాగాల ద్వారా అత్యవసర పిల్లలకు అందించే వైద్య చికిత్సల గురించి వైద్యులు ప్రేమ్ కుమార్ తో అడిగి తెలుసుకున్నారు. పభుత్వాలు లక్షలాది రూపాయలను పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వివిధ పథకాల ద్వారా విడుదల చేస్తోందనివాటిని సద్వినియోగం చేయాల్సిన బాధ్యత అందరి పైన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నవేరా, భాగ్య, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

డ్రయినేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా పరిశీలించాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ అధికారులకు ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు తో కలిసి మునిసిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ఏడవ వార్డు ముక్కడి పేటలో జరుగుతున్న మురుగు కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పురపాలక సంఘంలో చేపట్టిన అభివద్ధి పనుల్లో గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాసిర భాను, టిడిపి నాయకులతో పాటు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి : పట్టణంలోని ముదిరెడ్డిపల్లి ప్రాంతంలోని 36, 37 వార్డుల్లో మౌళిక సదుయాలను కల్పించాలని ఆ ప్రాంత ప్రజలు చైర్మేన్ రమేష్ కుమార్ ను కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ చైర్మేన్ చాంబర్ లో వార్డు ప్రజలు చైర్మేన్ రమేష్ కుమార్ కు వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తమ ప్రాంతాల్లో రోడ్డు, మురుగు కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన చైర్మేన్ ఇంజనీరింగ్ అధికారులను పిలిపించి వార్డుల్లో రోడ్డు, మురుగు కాలువలు వేయడానికి అంచనాలను సిద్ధం చేయడంతో పాటు త్వరతగితిన పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

వేతనాల మంజూరుకు వినతి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కంటేన్జెంట్ స్వీపర్లకు వేతనాలు ముంజూరు చేయించాలని మున్సిపల్ ఉపాధ్యాయులు చైర్మేన్ రమేష్ కుమార్ కు వినతిని ఇచ్చి కోరారు. సోమవారం ఎంజిఎం పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ ఎం సామ్రాజ్యం, మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధగిరి శ్రీనివాస్ మాట్లాడుతు హిందూపురం పురపాలక సంఘంలో 20 మంది కంటెన్జెంట్ స్వీపర్లు పనిచేస్తున్నారని వీరికి గత 8నెలలుగా వేతనాలు అందలేదని అన్నారు. వీరు దశాబ్దాల కాలంగా వారు పాఠశాలల్లో సేవలందిస్తున్నారని నెలకు రూ,4 వేలు వేతనం ఇస్తున్నారని చెప్పారు. మున్సిపల్ విద్య పర్యవేక్షణ, పరిపాలన పాఠశాల విద్యా శాఖ చేపట్టినప్పటికీ నిర్వహణ ఆయా పురపాలక సంఘాలే చేపట్టాల్సి ఉందన్నారు. ఇచ్చే అరకొర వేతనాలను మంజూరు అయ్యే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎఫ్ నాయకులు రామాంజినేయులు, ఐనుద్దీన్, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని చిన్న మార్కెట్ సమీపంలో ఉన్న కొల్లాపూరమ్మ ఆలయం వద్ద నివాసముంటున్న వెంకటేష్ (60) మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వెంకటేష్ తన గదిలో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. తలుపులు వేసుకుని నిద్రపోయాడు. అయితే ఇతను ఎప్పుడు మృతి చెందాడు ఎప్పటినుంచి ఆ గదిలో ఉన్నాడు అన్నది ఎవరికీ తెలియదు. గదిలో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి తలుపులు పగలగొట్టి చూస్తే మృతదేహం పడి ఉంది. వెంకటేష్ అనారోగ్యం కారణంగా మరణించి ఉంటాడన్న అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్త చెరువు

రైతుల సంక్షేమమే ప్రభుతం, సిఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలి పారు. ఎమ్మెల్యే సోమవారం కొత్తచెరువులో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి రైతులకు వ్యవ సాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశారు. అలాగే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ప్రారంభో త్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి రూరల్ మండలాలకు 40 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కాగా రైతులకు పంపిణీ చేశామన్నారు. విద్యుత్ ఏఈ కార్యాలయాన్ని రూ. 23 లక్షలతో నిర్మించామన్నారు. వైసిపి పాలనలో విద్యుత్ వ్యవస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు. రైతులు తక్కువ పెట్టుబడితో లాభసాటి పంటలు సాగు చేసుకోవాలన్నారు.దరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ విద్యుత్ కనెక్షన్ ఇస్తామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ శివరాముడు, ఏఈలు వెంకటేష్ నాయక్, చంద్రనాయక్, శ్రీనివాసులు, టిడిపి నాయకులు వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, మల్లిరెడ్డి, విజయ్ కుమార్, సామకోటి ఆదినారాయణ, బంగారు కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, మాణిక్యం బాబా, బండ్లపల్లి కృష్ణప్ప, రఘుపతి, వల్లపు సోమశేఖర్, బైరాపురం సర్పంచి రవి, లక్ష్మీనారాయణరెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : ఓడి చెరువులో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి రైతులకు 40 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లును పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు వ్యవసాయానికి ఉచితంగా 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని తెలిపారు. అడిగిన ప్రతి రైతుకూ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ, ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ రామాచారి, జనసేన పార్టీ పత్తి చంద్రశేఖర్, మండల కన్వీనర్ జయచంద్ర, బోయపల్లి శివారెడ్డి, డాక్టర్ జాకీర్ అహ్మద్, ఓబుల్ రెడ్డి, నిజాం, అంజినప్ప, ప్రసాద్, మీసేవ సుధాకర్, షాను, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి : ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్ : విద్యార్థులు భోజన సమయంలో పరిశుభ్రంగా చేతులు కడుక్కోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎనుమలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమె విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఆరోగ్యానికి సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు!

అనుమతులు లేకుండా నిర్మించిన రెండంతస్తుల భవనం

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ నగర పంచాయతీలో టౌన్‌ప్లానింగ్ అస్తవ్యస్తంగా మారిందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేపట్టినా అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా పట్టణ శివారులోని జర్నలిస్టు కాలనీలో పాత్రికేయుల పేరు చెప్పి యథేచ్ఛగా భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని మెడికల్ కళాశాల ఎదురుగా 668 సర్వే నెంబర్‌లో సుమారు 46 ఎకరాల్లో 2012లో జర్నలిస్టులకు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చింది. అదే సమయంలో కళాకారులు, మిలిటరీ ఉద్యోగులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సైతం ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. అప్పట్లో పాత్రికేయులతో పాటు మరికొందరు రాజకీయ పలుకుబడితో ఇళ్లు కూడా పొందారు. మరికొందరు ఇంటి పట్టా తీసుకున్న వారి నుంచి కొనుగోలు చేశారు.

జర్నలిస్టు కాలనీ ఎదురుగా వైద్య కళాశాల నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ఈ ప్రాంతం లో స్థలాలకు డిమాండ్ పెరిగింది. దీంతో ఈ కాలనీలో బయట వ్యక్తులు ఇళ్ల పట్టాలు కొనుగోలు చేస్తున్నారు. కాలనీలో పాత్రికేయుల కంటే బయటి వ్యక్తులే అధికంగా ఉన్నారు. వారిలోనూ ఎక్కువ మంది ధనవంతులే. ప్రస్తుతం ఈ కాలనీలో రెండు, మూడంత స్తుల భవనాలు వెలుస్తున్నాయి. కాలనీ మడకశిర ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో వ్యాపార సముదాలు నిర్మించుకోవచ్చనే ఉద్దేశ్యంతో వ్యాపారులు, ధనవంతులు పెద్దఎత్తున స్థలాలు కొనుగోలు చేశారు. జర్నలిస్టు కాలనీ అంటే అందరూ పాత్రికేయులే ఉంటారనే ఉద్దేశ్యంతో నగర పంచాయతీ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇదే అదునుగా భావించిన కొందరు వ్యక్తులు అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు చేపడుతు న్నారు. అయితే కాలనీలో కేవలం ఇద్దరు పాత్రికేయులు మాత్రమే గృహ నిర్మాణాలు చేపట్టారు. కొందరు ఆర్థిక ఇబ్బందులతో అమ్ముకుంటే మరి కొందరు ఇల్లు కట్టుకునే ఆర్థిక స్తోమత లేక స్థలాలను అలాగే వదిలేశారు.

నగర పంచాయతీ ఆదాయానికి గండి

జర్నలిస్టు కాలనీలో 20 అడుగుల వెడల్పు రోడ్లు వేశారు. కొందరు వారి స్థలంలో గృహ నిర్మా ణం చేపట్టి రెండు, మూడు అడుగుల రోడ్డు స్థలాలను ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారు. మరికొందరు రోడ్లుకు అడ్డుగా పునాదులు వేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే బుకాయిస్తున్నారు. నగర పంచాయతీ పరిధి లో ఇంటి నిర్మాణం చేపట్టాలంటే టౌన్ ప్లానింగ్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ కాలనీలో మాత్రం అందుకు విరుద్ధంగా పెద్ద పెద్ద భవన నిర్మాణాలు సాగుతున్నాయి. కొందరు రాజకీయ పలుకు బడితో నిర్మాణాలు చేస్తే, మరి కొందరు సంబంధిత అధికారులకు ముడుపులు చెల్లించి నిర్మాణాలు చేపడుతున్నట్లు సమాచారం. దీంతో నగర పంచాయతీ ఆదాయానికి భారీగా గండి పడు తోంది. అధికారులు నిత్యం ఈ ప్రాంతంలో తిరుగుతుంటారు. కానీ అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జర్నలిస్టు కాలనీలో నిర్మాణాలను పరిశీలిస్తున్న నగర పంచాయతీ అధికారులు

అక్రమ నిర్మాణాలను ఆపిన మున్సిపల్ సిబ్బంది

జర్నలిస్ట్ కాలనీలో అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఆపేశారు. నిర్మాణాలు చేయాలంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అక్రమ నిర్మాణదారులకు సూచించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టాలంటే ముందుగా ఆ స్థలానికి సంబంధించిన పట్టాతో పాటు గృహ నిర్మాణం ప్లానింగ్ అప్రూవల్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాలను ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించుకోవచ్చు అన్నారు. అయితే ఇల్లు మంజూరైనట్లు సంబంధిత పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని, అలాంటి కట్టడాలను కూల్చి వేస్తామని హెచ్చరించారు.

సిఐ శేఖర్‌ను కలిసిన ఎస్ఐ బాలాజీ నాయక్

ఎస్ఐగా బాలాజీనాయక్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సోమవారం నూతన ఎస్ఐగా బాలాజీ నాయక్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిఐ శేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే ఇచ్చారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఎస్ఐ బాలాజీ నాయక్ ఈ స్టేషన్‌కు వచ్చారు.

'కియా' ఉద్యోగ, కార్మికులకు సరైన వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

కియాతో పాటు అనుబంధ కంపెనీల్లో ఉద్యోగ, కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో కియా కంపెనీ వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కియా కంపెనీ 2022-23లో ప్రభుత్వానికి రూ.1350 కోట్ల పన్ను ఎగ్గొట్టడంతో పాటు ఉద్యోగులు, కార్మికులకు సరైన వేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్, సెలవులు, బోనస్, ఓటి వంటివి ఇవ్వడం లేదని మండిపడ్డారు. పెనుకొండలోని కియా, పెరంబూర్ లోని హుండై ఇద్దరూ భాగస్వాములేనని, అయితే పేర్లు, ఊర్లు మార్చి ఈ కంపెనీలే నిర్వహిస్తుంటారన్నారు. కియా కంపెనీ పెనుకొండ వద్ద 20వేల మంది కార్మికులతో విడిభాగాల కంపెనీలో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని, దక్షిణ కొరియాలో ఇదే పని చేసే కార్మికులకు ఇక్కడి కంటే చాలా ఎక్కువ వేతనాలు ఇస్తున్నారన్నారు. కియా కంపెనీ పన్ను చెల్లించేలా, ఉద్యోగ, కార్మికులకు అన్ని హక్కులు అమలయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, తిప్పన్న, నాయకులు పెడపల్లి బాబా, పైపల్లి గంగాధర్, జివి.రమణ, రఫీ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని పులేరు జడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఎస్ఎంసి ఛైర్మన్ జయపాల్‌యాదవ్ సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులకు భోజనం వడ్డించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వద్దు : డిఆర్ఓ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులు బాధ్యతగా పని చేయాలని డిఆర్ఓ విజయసారథి ఆదేశించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో సోమవారం డిఆర్ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 123 అర్జీలు అందాయి. డిఆర్ఓ మాట్లాడుతూ అధికారులు ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. గడువు లోపు పరిష్కారం కాకపోతే ఆ సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అలాగే ఆ సమస్య ఎందుకు పరిష్కారం కాలేదో బాధితునికి తెలిపాలన్నారు. బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మధునాయక్, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరిస్తున్న డిఆర్ఓ విజయసారథి

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో ఉన్న శ్రీవెంకటేశ్వర వృద్ధాశ్రమంలో సోమవారం తుమకూరులోని శ్రీదేవి వైద్యశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు తిమ్మారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో రాష్ట్ర బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి 600 రోజులు పూర్తయింది. పేదల ఆకలి తీర్చేందుకు సవిత ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నిరంతరాయంగా ప్రతి రోజూ వందలాది మంది కార్మికులు, పేదలు కడుపు నిండా భోజనం చేస్తున్నారు. అన్న క్యాంటీన ఏర్పాటు చేసి 600 రోజులు పూర్తయిన సందర్భంగా టిడిపి పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ మంత్రి సవిత సొంత నిధులతో ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, రొద్దం మండల కన్వీనర్ నరహరి, నాయకులు చంద్రమౌళి, నరసింహులు, అశ్వర్థనారాయణ, మంజు నాథ్, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న టిడిపి నాయకులు

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం-2025 క్యాలెండర్‌ను సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఏటా ఉద్యోగ సంఘాల క్యాలెండర్‌ను తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.జయరాం, గ్రంథాలయ అటెండర్ వెంకటరమణ, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాణిక్యం బాబా, నాగేంద్రప్రసాద్, సోహెల్, రఘుపతి పాల్గొన్నారు.

తహశీల్దార్ దృష్టికి రేషన్ డీలర్ల సమస్యలు



అద్వికను అభినందిస్తున్న ఎంఇఒ సుధాకర్‌నాయక్

ప్రజాశక్తి-రొద్దం

నూతన తహశీల్దార్ ఉదయ్‌శంకర్ రాజ్‌ను సోమవారం పలువురు రేషన్ డీలర్లు మర్యాద పూర్వ కంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో 35 షాపులు ఉండగా, 33 షాపులకు పెనుకొండ స్టాక్ పాయింట్ నుంచి, 2 షాపులకు హిందూపురం ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ నుంచి సరుకులు వస్తాయన్నారు. బియ్యం బస్తాల్లో 42, 44, 46 కిలోల చొప్పున తక్కువగా ఇస్తున్నారన్నారు. దీంతో కార్డుదారులకు పంపిణీ చేసే సమయంలో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఫిబ్రవరి నెలలో ఒక్కో షాపునకు 5 నుంచి 10 క్వింటాళ్ల బియ్యం తగ్గించి ఆర్ఓ వేశారన్నారు. అంతేకాకుండా ఓ షాపులో స్టాక్ అయిపోతే ఆ షాపునకు సంబంధించిన కార్డుదారులు పక్క షాపునకు వెళ్తున్నారన్నారు. కావున ఎక్కడి కార్డులకు అక్కడే రేషన్ ఇచ్చేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు సిద్దన్న, ఉమాశంకర్, గంగాధర్, రామాంజనప్ప, రామాంజనేయులు, బాబు, శేషు, మస్తాన్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు ఎస్ఐగా రంగనాయక్

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు ఎస్ఐగా రంగనాయక్ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. గాండ్లపెంట ఎఎస్ఐగా పని చేస్తున్న రంగనాయక్ ఉద్యోగోన్నతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని పులిమితి, సడ్లపల్లి, బసనపల్లి గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరాలో వేళలు మార్చినట్లు ఏఈ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 3 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా ఉంటుందని రైతులు గమనించాలని ఆయన తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణపై కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ సిఐ నారాయణరెడ్డి కోరారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై సోమవారం సిఐ పోలీస్‌స్టేషన్‌లో తోపుడుబండ్లు, చిరు వ్యాపారులు, ఆటో, టాక్సీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ బండ్లు అడ్డుపెట్టవద్దన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం, ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



స్టేషన్‌లో వ్యాపారులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ

ఏపీకి దశ దిశ సిఎం చంద్రబాబే : పల్లె

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఏపీకి దశ, దిశ ఉన్న నాయకుడు సిఎం చంద్రబాబునాయుడే అని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చౌడంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి సోమవారం ఆయన హాజరయ్యారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఓ వైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందన్నారు. అనంతరం కదిరి మండలంలోని కౌలేపల్లి గ్రామానికి చెందిన గుంతకల్లు ప్రభాకర్ తల్లి నాగలక్ష్మి అంత్యక్రియలకు హాజరయ్యారు. ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. పల్లె వెంట టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, నాయకులు బోయపల్లి శివారెడ్డి, రాజారెడ్డి, కృష్ణమూర్తి, సోమశేఖర్, శంకర్, హనుమంతురెడ్డి, తిప్పన్న, రమణ ఉన్నారు.

సామాజికవేత్త రాజగోపాల్ మృతికి నివాళి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని మద్దన్నగారిపల్లి గ్రామానికి చెందిన సామాజికవేత్త గడ్డం రాజగోపాల్, సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయం ఇన్‌ఛార్జి హరీష్‌బాబు ఆ గ్రామం వెళ్లి రాజగోపాల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణయాదవ్, నాయకులు రమేష్‌బాబు, ప్రభాకర్‌నాయుడు, తుమ్మల మనోహర్, కోట్ల బాబి, తుమ్మల సూరి, అంజన్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజగోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీరామ్

విశ్వదీప సేవా సంఘం చొరవతో నేత్రదానం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన పూజారి రామాంజనేయులు(64) సోమవారం గుండెపోటు తో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు విశ్వదీప సేవా సంఘం సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని వారి కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యుల సహకారంతో జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కుళ్లాయప్ప, టెక్నీషియన్ రాఘవేంద్ర రఘువీర్ రామాంజనేయులు నేత్రాలను సేకరించారు. కార్యక్ర మంలో వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షులు గాజుల సురేష్, కార్యదర్శి శేఖర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, కేశవరెడ్డి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

రామాంజనేయులు(ఫైల్)

జాతీయ స్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలకు అద్విక ఎంపిక

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక శ్రీజ్యోతి హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని అద్విక జాతీయస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలకు ఎంపికైంది. అద్వికతో పాటు ఆమె తల్లిదండ్రులను సోమవారం ఎంఇఒ సుధాకర్ నాయక్, హెచ్‌ఎం మిడతల లక్ష్మీనారాయణ అభినందించారు. ఎంఇఒ మాట్లాడుతూ అద్విక వేదిక్ మాథ్స్ పోటీలకు ఎంపిక కావడంలో తల్లిదండ్రుల కృషి ఎనలేనిదన్నారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మిడతల ధర్మతేజ, ఉపాధ్యాయులు నాగపెద్దిరాజు, శంకరయ్య, కాటమయ్య, రమేష్, ఆదెప్ప, రఫీ, వెంకటపతి, పరశురాం, మధు, లావణ్య, ఉమాదేవి, దీప, లక్ష్మీ, పూజ, సుజాత, ధనలక్ష్మి, గంగాదేవి, ధనలక్ష్మి, సువర్ణ, గీత పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

ప్రజాశక్తి-అగళి

వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాలని కోరుతూ సోమవారం రైతులు మండలంలోని హెచ్‌డి.హళ్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. రైతులు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం వల్ల రాగి, వేరుశనగ, కూరగాయల పంటలు ఎండిపోతున్నా యని, గ్రామాల్లో తాగునీటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు 7 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పి కేవలం 6 గంటలే ఇస్తున్నారని, అది కూడా నిరంతరాయంగా కాకుండా రోజుకు కేవలం రెండు, మూడు గంటలే ఇస్తున్నారని మండిపడ్డారు. శని, ఆది, సోమవారం వరుసగా మూడు రోజులు విద్యుత్ సరఫరా లేకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కొత్తగా వచ్చిన ఏఈ వారం రోజులు పని చేసి 3 నెలలు సెలవులో వెళ్లిపోయారని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి 7 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

రైతులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. అందులో జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్‌తో పాటు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. అనంతరం అడవి జంతువుల వల్ల నష్టపోయిన ముగ్గురు రైతులకు జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆర్థికసాయం అందజేశారు. పెనుకొండ అటవీ క్షేత్రం పరిధిలో అడవి జంతువుల వల్ల పశువులు, గొర్రెలు, మేకలను కోల్పోయిన రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. గుడిబండ మండలంలోని మదనగుంటకు చెందిన తిమ్మప్పకు రూ. 10వేలు, గుణమోర్ బాగల్‌కు చెందిన రంగనాథ్‌కు రూ. 12వేలు, కల్లుమర్రికి చెందిన నారాయణకు రూ. 6వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ప్రజాశక్తి-మడకశిర

సంకల్ప్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 8 రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిఆర్‌డిఎ పిడి నరసయ్య మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారవడానికి ఈ శిక్షణలో మెలకువలు, వ్యాపార నిర్వహణ, శక్తి సామర్థ్యాలు, మహిళలు వ్యాపారంలో రాణించటానికి అవసరమైన అనుమతుల గురించి వివరిస్తారన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, యువతీ, యువకులు, గణేష్ స్కిల్ హబ్ కోఆర్డినేటర్, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరంలో విద్యార్థులకు మాత్రలు వేయిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియాసాల్మన్

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని కెహెచ్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.గోపాల్ నాయక్ అధ్వర్యంలో వైస్ ప్రిన్సిపల్ డా. ఎస్.చిట్టెమ్మ అధ్యక్షతన సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ కోసం 'ఆల్బెండజోల్' మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు షమీవుల్లా, ఎస్.పావని, బి.త్రివేణి, ఎ.కిరణ్‌కుమార్, ఎం.భువనేశ్వరి, ఎం.పుష్పావతి, ఎం.సరస్వతి, బి.ఆనంద్, మీనా, ధనుంజయులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మండలంలోని దర్శనమల పిహెచ్‌సి పరిధిలోని కునుతూరు, గొట్లూరు నైరా పాఠశాలలు, బత్తలపల్లి మండలంలోని ఎంజెపి బిసి స్కూల్‌లో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సెల్వియాసాల్మన్ ఆధ్వర్యంలో మాత్రలను విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పుష్పలత, దిలీప్ కుమార్, సూపర్వైజర్లు రాజశేఖర్‌రెడ్డి, జైతున్‌బి, హెల్త్ అసిస్టెంట్లు ఆంజనేయులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని ఉప్పార్లపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం నరసింహులు, రేకులకుంట జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం గిరిజ, మడకశిర జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రామాంజనమ్మ, ఆదిరెడ్డిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం హేమలత, ఉపాధ్యాయులు శివన్న ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది విద్యార్థులకు మాత్రలు వేశారు.

అగళి : నులిపురుగుల నివారణపై అగళిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంఇఒ సమక్షంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి శివ, డాక్టర్ శివనంద్, సూపర్వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల వైద్యాధికారి డా. రాజేంద్ర ఆధ్వర్యంలో పివిఎస్ పాఠశాలలో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది. సరస్వతమ్మ, నాగరాజు, శాంతకుమారి, రామకృష్ణమ్మ, కరస్పాండెంట్ వెంగముని నాయుడు, టీచర్లు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ హరికుమార్, డాక్టర్ ఓంకార్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మనోహర్‌రెడ్డి, రవీంద్ర, రత్నమ్మ, శారద పాల్గొన్నారు.

నల్లచెరువు : ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కెజిబివి, ఏపీ మోడల్ స్కూల్‌లో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంఇఒ తిరుపాల్‌నాయక్, మండల వైద్యాధికారి డాక్టర్ కల్పనారెడ్డి, సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, సూపర్వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆలయ హుండీ చోరీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రామగిరి మండలంలోని నసనకోట గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన చోరీ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. డీఎస్పీ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో సిఐ శ్రీధర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ముత్యాలమ్మ ఆలయంలో ఈ నెల 3వ తేదీ రాత్రి చోరీ జరిగినట్లు 4వ తేదీ ఆలయ ఈవో ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుధాకర్‌యాదవ్ కేసు నమోదు చేశారన్నారు. సిఐ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయగా ఫింగర్ ప్రింట్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో కేసును ఛేదించారన్నారు. పోలీసులు కర్నాటక సరిహద్దులోని ఎంసి పల్లి క్రాస్ వద్ద ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి ఓ బైక్, 3 సెల్‌ఫోన్లు, రూ. 1.7లక్షల నగదు, చోరీచేసిన వస్తువులు స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును ఛేదించిన రామగిరి సిఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్, సిబ్బంది సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, సాగర్‌బాబు, హర్షవర్ధన్ రాజు, దామోదర్, వెంకటేష్, రాజప్ప, శేఖర్, వేణుగోపాల్‌రెడ్డిలను ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

విద్యుత్ షాక్‌కు గురై పెయింటర్ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని మల్లేనిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. బత్తలపల్లి మండలంలోని మాల్యవంతం గ్రామానికి చెందిన మారుతి, సరస్వతీ దంపతులు కుమారుడు రామ్‌చరణ్ మల్లేనిపల్లిలో ఓ ఇంటి వద్ద బయట వైపు ఇనుప నిచ్చెన వేసుకొని పెయింట్ చేస్తూ ఉండగా నిచ్చెన మార్చేటప్పుడు పక్కనే ఉన్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కిందపడ్డాడు. అతడితో పాటు పనికి వచ్చిన పెయింటర్లు హుటాహుటిన ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఉప్పార్లపల్లి వద్ద పెన్నా నది నుంచి అక్రమంగా కర్నాటకకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లకు తహశీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు జరిమానా విధించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న చెరుకూరు గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లను సోమవారం పోలీసులు పట్టుకొని తహశీల్దార్‌కు అప్పగించారు. దీంతో ఆయన ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 2వేల చొప్పున జరిమానా విధించి పంపించారు.